క్షణకాలం ఆశ్చర్యపోయేడు జీవన్. రాధిక - తన ఇంటికే వస్తోంది. ఆమె తన కొలీగ్ రామం భార్య.

"అక్కడే నిలబడిపోయేరేం? లోపలికి రండి !" సాదరంగా ఆహ్వానించాడు జీవన్.

వచ్చి తటపటాయిస్తూ కుర్చీలో కూర్చుంది రాధిక.

మొహం పీక్కుపోయి ఉంది. జీవంలేని కళ్ళు. పావం - ఎడారిలో నీటికోసం తపించే బాటసారిలా...

"చెప్పండి !" రాధిక తాగిన మంచినీళ్ళ గ్లాసు నందుకుంటూ అడిగాడు జీవన్.

ఓసారి జీవన్ వైపు చూసి తల దించుకుని నెమ్మదిగా చెప్పింది-

"మీరు నాకో సాయం చేయాలి." ఆ గొంతులో అర్థింపు.

"తప్పకుండా !" పూర్తి భరోసా ఇస్తూ అన్నాడు జీవన్.

గొంతు సవరించుకుని చెప్పింది రాధిక.

"మా అయనకు తాగుడు అలవాటు చేయాలి."

నెత్తిమీద పిడుగు పడ్డట్టు ఫీలయ్యాడు జీవన్. అసలు తను విన్నది వాస్తవమేనా? వాస్తవమే. ఎందుకంటే ఎదురుగా రాధిక మళ్ళీ చెబుతూంది.

"మీ కాశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ ఇది ఓ జీవితానికి సంబంధించిన విషయం. ఇందులో ఆయనకు ఎటువంటి హానీ జరగదని హామీ ఇస్తున్నాను. దయచేసి మీ రీ సహాయం చేసిపెట్టాలి." దీనంగా అంటోంది.

గిల్టీగా ఫీలయ్యా డతను. తను బ్రహ్మచారి. పెళ్ళీ పెటాకులూ లేనివాణ్ణి. అందుకే వచ్చిన జీతాన్ని జల్సాగా ఖర్చు చేస్తూ అప్పుడప్పుడూ బార్ల వెంట తిరగడం నిజమే. కానీ తను ఇలా ఈవిడ దృష్టిలో-

ఆపైన ఆలోచించలేకపోయాడు. ఏది ఏమైనా. ఆమె నా సహాయం కోసం ఆశించింది. అస లెటువంటి ఆడదీ పెళ్ళైన రెండు, మూడు సంవత్సరాలకే తనే భర్తను తాగుడుకు బానిసను చేయించడం మరీ విడ్డూరంగా ఉంది.

మినీ కథ

# మనుషుల్లో ఇమడలేని మానవత

-ఏ. జి. మణి

అందుకే ఓ నిశ్చయాని కొచ్చి చెప్పేడు - "తప్పకుండా ప్రయత్నిస్తాను" అని.

** ** **

కాలింగ్‌బెల్ మోగడంతో తలుపు తెరిచిన రాధిక బయట సరిగ్గా నిలబడలేక తూలిపోతున్న భర్తను చూసి తృప్తిగా నిట్టూర్చింది.

భర్తకు ఆసరా ఇచ్చి లోపలికి తీసుకెళ్ళింది. తనే దగ్గరుండి అన్నీ చేసి, భోజనం చేయించి మంచంపైన పడుకోబెట్టింది.

చెప్పిన మాట నిలబెట్టుకున్న జీవన్‌కు మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది రాధిక.

** ** **

రాధిక చెప్పింది విని ఖిన్నురాలైంది మాలిక.

"ఏవి టక్కా నువ్వు చెప్పేది? బావ తాగుడుకు బానిసయ్యాడా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఔనే ! పెళ్ళై ఇన్నేళ్ళయినా పిల్లలు కలక్కపోవడంతో ఆయన పరిస్థితి విషమించింది. అందుకే మనశ్శాంతి కరువై తన జీవితాన్నే నాశనం చేసుకుంటున్నారు." వెక్కిళ్ళ మధ్య ఏడుస్తూ చెప్పింది రాధిక.

"నా సహాయం కావాలన్నావ్. దానికి న న్నేం చెయ్యమంటా వక్కా?" తను కూడా బాధపడుతూ అడిగింది మాలిక.

"నువ్వు బావను పెళ్ళి చేసుకోవాలి." చెప్పింది రాధిక.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడింది మాలిక.

"బావనా? నువ్వు బ్రతికుండగానే రెండో పెళ్ళా?" ఇంకా షాక్ నుంచి తేరుకోకుండా అడిగింది మాలిక.

"అవును మాలికా. నువ్వు మాత్రం కాదనకు. నువ్వీ పెళ్ళికి ఒప్పుకోకపోతే బావ బ్రతకడం కష్టం. ఆయన జీవితం ఎవ్వరికీ కాకుండా ఛిన్నాభిన్నమైపోతుంది. కనీసం నువ్వు పెళ్ళి చేసుకుంటే నన్నా ఆయన స్థితి మెరుగుపడుతుందేమో అని ఆశ. ఆయన కీ విషయం ఇంకా చెప్పలేదు. ఆయ నొప్పుకోకపోయినా సర్దిచెప్పి ఒప్పించే బాధ్యత నాది. నీ పెళ్ళి అయిం తరువాత మీ సంసార జీవితంలో నే నెన్నటికీ అడ్డు రాను."

అక్క పడే ఆవేదన చూసి చలించిపోయింది మాలిక. త నొక్కతీ త్యాగం చేస్తే అక్క పసుపు కుంకుమలు నిలబడతాయి. అంతేగాక బావ భావిజీవితానికి పునాది వేసిన దా న్నవడం ఈ జీవితానికి సంతృప్తి నిస్తే అంతే చాలు ననుకుంటూ అక్క రాధికకు తన అంగీకారాన్ని తెలిపింది మాలిక.

** ** **

"కంగ్రాట్స్‌్‌య్ రామం." చెప్పాడు డాక్టర్ జగదీష్.

"అస లీ కంగ్రాట్సంతా నీకేనోయ్. మా ఆవిడకు నా ఒత్తిడి ప్రకారం పిల్లలు కలిగే ఛాన్సు లేదని నా పెళ్ళి మాలికతో అయ్యేలా ఏర్పాటు చేశావ్." చెప్పాడు రామం ఆనందంతో.

"నీకు తాగు డలవాటు చేయించి, ఆ సాకుతో నీ ఆస్తికి వారసుణ్ణి ఎవరో బయటివాడు తన్నుకుపోవడం దేనికని తన పథకంతో తన చెల్లినే నీకు కట్టబెట్టిన రాధిక తెలివి అమోఘం" చెప్పాడు డా. జగదీష్ నవ్వుతూ.

ఆ రాత్రి పడగ్గదిలో చెప్పింది మాలిక రామంతో - "ఆ రోజు అక్క పెళ్ళిలో చూసినప్పుడే ఎలాగైనా నిన్నే పొందా లనుకున్నాను. ఈ రోజు మన పథకం పారి మనిద్దరం ఒకటవడం - రియల్లీ ఐ యామ్ వెరీ హాపీ."

"ఆ రోజు జీవన్ జరిగిన విషయం చెప్పడంతో ఆ రోజలా తాగినట్టు నాటకమాడానంతే." చెప్పాడు రామం - దిండుకింద విస్కీ బాటిల్ ఉందో, లేదో తడిమి చూసుకుంటూ. ★




